# మొటిమ

బృందమైన మొహాల్ని యిట్టే అందవికారం చెయ్యగల ఈ మొటిమ ఎంత ఘోరమైనదో చెప్పడానిక్కూడా వీల్లేదు. అది ముఖ్యంగా మొదట్లో ముక్కుమీద వచ్చికూచుని, "నే నున్నానంటే అందరికీ తెలిసిపోతాను. తామరకిలాగ నాకు దాపరికం లేదు. నన్నెవరన్నా అణగద్రొక్కాలని ప్రయత్నం చేశారంటే నేను మరింత బాచి, క్రమంగా మొహమంతా వ్యాపిస్తాను. చూస్కో నా తడాఖా!" అంటుంది.

యిలాంటి మొటిమ ఒకటి, పాపం సావిత్రి ముక్కుమీద ఏర్పడింది. ఆ అందమైన తెల్లటి మొహంలో ఆ సువ్వపువ్వులాంటి ముక్కుమీద ఈ మొటిమ ఏర్పడడం అనేది చాలా శోచనీయమయిన విషయం. మరి పాపం సావిత్రి ఏం చేస్తుంది? ఆమెకి దాన్ని కొరికేద్దామన్నంత కోపం వచ్చింది. కాని ఎలాగ కొరకడం? అది ముక్కుమీదకెక్కి కూర్చుందాయె! మరి దీనికి తరుణోపాయం ఏమిటి?—పెళ్ళి. సావిత్రి కింకా పెళ్ళి కాలేదు.

రేపు సావిత్రిని చూడ్డానికి వస్తున్నాడొక అబ్బాయి మోహన్ తలిదండ్రులతో. కాని యింతట్లోనే దాపరించింది ఈ శని. అతను చాలా నాగరీకుడట. చాలా కాలం ఉత్తరాదినే ఉండటం తెలుగు కొస్తా మర్చిపోయాట్ట. చాలా అందంగా ఉంటాట్ట.

అంతక్రితం రాత్రే వాళ్ళ నాన్న అతని ఫోటో చూపించారు. ఎంత బావున్నాడని! సావిత్రి ఆ ఫోటో చూసుకు చూసుకు తెగ మురిసింది యిలాంటివాడు తనకి భర్త కావాలని. కాని తెల్లారుతూనే ముక్కుమీద దాపరించింది ఈ దిక్కుమాలిన మొటిమ. అవును. తప్పకుండా తనని చూసి అసహ్యించుకుంటాడతను. "మోహన్ ఎంతబాగుందో ఆ పేరు. కాని దురదృష్టవంతురాల్ని"—అనుకుంది సావిత్రి.

యింతట్లో సావిత్రి తల్లి వచ్చింది. "అమ్మాయ్ రేపు పెళ్ళివాళ్ళొస్తారు. ఏం కట్టుకుంటావు? ఆ జాకెట్ సిల్కుచీర కట్టుకున్నావంటే బంగారబొమ్మలా వుంటావే. మీ యిద్దరూ నుంచుంటే అచ్చం చిలకా గోరింకల్లా ఉంటారే" అంది.

సావిత్రి విసుగ్గా తల్లికేసి చూసి, "ఏం మునిగిపోయిందిలెద్దూ. నన్ను కాస్సేపు ఒంటరిగా ఉండనీ" అంది.

ఆమె మాట్లాడుతూంటే ఆ మొటిమ నొప్పెడుతోంది.

"మునిగిపోక ఏమిటి? ఆడదానికి పుట్టాక ఎవరిచేతిలోనో పెట్టేదాకా బాధనూ" అంది తల్లి.

"మునిగిపోతే పోనీ. నే నేమీ కట్టుకోను ఇప్పటికి. నాకేమీ అక్కర్లేదు." అంది సావిత్రి విసుగానూ, కోపంగానూ ముక్కు కప్పుకొంటూ.

"ఏమిటి ముక్కు ఊరికే అలా కప్పుకొంటావు? జలుబా ఏమిటి?" అని ఆవిడ ముక్కుని తన పమిటకొంగుతో తుడవబోయి. అక్కడ

★ రాజా ★

పెద్ద మొటిమనిచూసి, కొన్నేపు నోరు తెరచు కొని అలాగే తెల్లబోయి చూడ్డం మొదలెట్టింది.

సావిత్రి ఏడుస్తూ, "చూడు, బాగా చూడు! రాక్షస మొటిమ కాదూ?" అంది.

"నా చిట్టితల్లివి గాదూ? ఏడవొద్దు. మరేమీ ఫర్వాలేదు. ఇదుగో, నేను ఉల్లిపాయలూ, మిరియాలూ, అల్లం, తేనే వేసి ఒక పట్టువేస్తాను. అది వేశానంటే రేపు తెల్లారేసరికి మచ్చుకూడా లేకుండా ఎక్కడిదక్కడికి మాయమైపోతుంది." అని ఆవిడ పమిటకొంగుతో దుఃఖంతో ఎర్రబడ్డ కళ్ళు తుడిచి, "ఇప్పుడు నువ్వు చక్కహా సంతోషంగా ఉండాలి. బంగారు తల్లివి కాదూ సరే గాని, మర్చిపోయాను. రేపు నువ్వేం చీర కట్టుకుంటావూ?" అని సావిత్రిని ఓదార్చింది.

*    *    *

సాయంత్రం అయిదింటికల్లా ఒక టెలిగ్రాము వచ్చింది. సావిత్రి తండ్రి సుందరంగారు తమ దళసరి కళ్ళద్దాల కళ్ళజోడు తగిలించుకుని ఒక సారి దాన్ని పరకాయించి, భార్యని "ఏమేవ్!" అని పిలిచారు.

'ఆఁ! ఏమిటీ?' పకోడీల ప్లేటుతో ప్రవేశించింది.

'వాళ్ళు రేపొద్దుటికి మన యింటికి వస్తారట. అమ్మాయిని బాగా తయారవమని చెప్పు' అన్నాడాయన భార్య యిచ్చిన పకోడీల ప్లేటు అందుకుంటూ.

"అయితే ఏం చెయ్యమంటారు రేపటికి?"

మరేం అక్కర్లేదు. కోళ్ళనికోసి వండిపెట్టక పోతే చాలు అన్నారు.

ఆయన కోళ్ళ సంగతి మాట్లాడుతూండడం చేత ఆపకోడీని చిదిపి, అందులోంచి కోడికాలు లాంటి వస్తువు నొకదాన్ని తీసి, జాగ్రత్తగా పరిశీలించడం మొదలెట్టారు.

చాల్లేస్తురూ, వాడిపోయిన మిరపకాయని చూసి నానా గందరగోళం చేస్తారు. అందావిడ లోపలికి వెడుతూ.

ఆయన ఫలహారం పూర్తిచేసి, చెయ్యి కడుక్కునే లోగానే ఆవిడ లోపలికెళ్ళి కూతుర్ని పిలుచుకొచ్చింది.

'ఇలా రామ్మా, సావిత్రీ! రేపొద్దున్న పెళ్ళి వాళ్ళొస్తారు నిన్ను చూడ్డానికి. సరే, నిన్ను చూశాక యింక వాడెందుకు వదులుతాడులే' అన్నారు. ఇంతట్లో ఆయన దృష్టి ఆమె ముక్కు మీద పడింది. వెంటనే ఆయన,

'ఏమిటి సావిత్రీ? ఏమిటది నీముక్కుమీద?' అన్నారు. సావిత్రి బిక్కమొహం వేసింది.

'ఆ ఏముందండీ, ఏదో చిన్న మొటిమ. అని' సర్ది చెప్పింది ఆయన భార్య.

ఆఁ, పెద్దదేలాగుండేది? కళ్ళజోడువాణ్ణి నాకే బాగా కనిపిస్తుందే!

అబ్బ! ఊరుకోండురూ, పెద్ద గోలచేస్తారు అమ్మాయి బేజారెత్తిపోడానికి. అసలే అది ఎవరన్నా చూస్తారేమోనని మహా భయపడిపోతోంది. దానికో మహ మంచి మందుంది. ఉల్లిపాయలూ, మిరియాలూ, అల్లం, తేనేకలిపి ఈ రాత్రి పట్టేశామంటే రేపటికంతా మటుమాయమైపోతుందంటే నమ్మండి అన్నదావిడ.

నిజం! అన్నాడు సుందరం వెటకారంగా.

కాక అందులో సందేహానికేంవుంది?

ఆయన వెంటనే, అది మరింత పెద్దదవుతుందన డానికి ఏమాత్రం సందేహం లేదు. సావిత్రీ, నువ్వు మీ అమ్మ యిచ్చినపట్టు అస్సలు వేసుకోకు. రేపటికి పెద్ద పుండవుతుంది. నేను నీకు మంచి మందిస్తాను. ఊరికే చదివానా యేమిటి నేను హోమాపతీ? "నక్సవోమికా సిక్స యింతు" అనే బిళ్ళలు రెండు నూరి, ఆ పొడి ఆ మొటిమమీద వేసి, రాత్రల్లా కట్టు కట్టుకున్నావంటే అది రేపటికిచిదుకుతుంది. వారం రోజులలో పూర్తిగా తగ్గిపోతుంది. హోమియోపతీవల్ల నిలకడగా తగ్గినాకూడా, పూర్తిగా నిశ్శేషంగా తగ్గిపోతుంది అన్నాడాయన.

ఆయన వాక్యంపూర్తి చెయ్యకుండానే ఆయన భార్య మూతి విరుచుకుని మద్దెల్లా దొర్లుకుంటూ యింట్లోకి వెళ్ళిపోయింది.

*    *    *

ఆరాత్రికి నిద్రపట్టలేదు. తల్లి యిచ్చిన పట్టు, తండ్రి యిచ్చిన బిళ్ళలూ బల్లమీద అలాగే

ఊన్నాయి. ఆమె అద్దంముందు కూర్చుని ఆ మొటిమని చూసుకుని దాన్ని తిట్టడం మొదలెట్టింది.

దుష్టపు మొటిమా! పాతకీ! నువ్వు నా మొహాన్ని కూర్చోవాలంటే నీకిప్పుడే యింత తొందరొచ్చిందేమే నీ పోయ్యేకాలం కాలా! రెండురోజులు పోయాక రాకూడదే నీ మొహం మండా! పోనీ వచ్చావే అనుకో, వచ్చి నా వీపుమీదో, కాళ్ళమీదో, మరోచోటో రాకూడదా? పబ్లిగ్గా అందరికీ కనిపించేట్టుగానూ అందాన్ని చెరిచేట్టుగానూ నా మొహాన్నే రావాలీ నీ మొహం ఈడిస్తే? అంతగా మొహాన్నే రావాలీ అంటే మా నాన్న మొహాన్నో, మా అమ్మ మొహాన్నో, కనీసం మా అన్న మొహాన్నో రాకూడదూ? పోనీ, మొహంమీదే వచ్చావనుకో వచ్చి, మరీ బట్టబయలుగా ముక్కుమీద రాకపోతే యే కనుబొమలచాటునో, యే గడ్డంకిందో వస్తే నీ సొమ్మేం పోయింగే. దరిద్రపు మొటిమా!

ఈ తిట్లుతిని మొటిమకి కోపం వచ్చిందో యేమో వెంటనే చితికి, నాతోనా నీ దెబ్బలాటలు? ఇప్పుడు చూస్కో. దిక్కున్నవాళ్ళతో చెప్పుకో. అని చెప్పినట్టుగా, ముక్కునంతా ఎర్రగా కందగడ్డలా చేసింది.

ఆమె యిక మొటిమతో తగువులాడి లాభం లేదని చెప్పి, యింతవరకూ ఎన్నడూ దేవుణ్ణి ప్రార్థించి ఎరక్కపోయినా, ప్రార్థించడం మొదలెట్టింది.

"దేవా! నువ్వు సర్వాంతర్యామివి. నువ్వు నాలో ఉన్నావ్. నా ముక్కులో ఉన్నావు. అన్ని చోట్లా వున్నావు. అంచేత దయచేసి నాకే కాకుండా, నీకు కూడా బాధ కలిగిస్తూన్న ఈ పాపిష్టి మొటిమని తొలేసెయ్యి. మాయం చేసేయ్'' అని ప్రార్థించింది.

అలా ప్రార్థిస్తూనే ఆమెకో కునుకు వచ్చింది అందులో ఆమెకి ఒక కల. దేవుడొచ్చి ఆ మొటిమ మాయం చేశాడు. మోహనూ, తనూ చెయ్యీ, చెయ్యీ పుచ్చుకుని ఎయిరోప్లేన్ ఎక్కుతున్నారు.

ఆమె తెల్లారకట్ట లేస్తూనే ముక్కుకో కసుద్ద కట్టేసుకుంది. అప్పుడామె మరీభయంకరంగా ఉంది. చూసిన వాళ్ళకి ఆమెకి ముక్కుందో లేదోనన్న అనుమానం కూడా కలుగుతుంది.

ఆమె కాలకృత్యాలు తీర్చుకుని, కాఫీ తాగి, వాళ్ళమ్మ బట్టలు మంచివి కట్టుకోమన్నా వినకుండా మళ్ళా పడుకుంది.

యింతట్లోకే మోహన్ తలిదండ్రులు జట్కా దిగి వచ్చారు లోపలికి లావుపాటి ఆయనా, సన్నపాటి ఆవిడానూ. ప్రక్క గదిలో సావిత్రి అరచేతులో గుండెలు పెట్టుకుని ఎప్పుడు మోహన్ లోపలికి వస్తాడోనని భయంగా ఉంది.

సుందరంగారు వాళ్ళని కూర్చోబెట్టి భార్యని కాఫీ తెమ్మని చెప్పి, "ఏడీ మీ మోహన్? రాలేదూ?" అని అడిగారు.

"వచ్చాడు" అని వాళ్ళిద్దరూ ఒక్కసారే సమాధానం చెప్పారు.

సావిత్రి ప్రక్కగదిలోంచి పాము చెవు పెట్టుకుని వింటోంది.

"మరి ఇక్కడికి రాలేకేం?"

"ఏమీలేదూ...కాస్త..." అని మోహన్ తండ్రి అంటూండగానే, "ఒంట్లో బాగుండలేదు" అని మోహన్ తల్లి అందుకుంది.

"అరే, అంత హఠాత్తుగా ఏమయింది?" అన్నారు సుందరంగారు ఖంగారుగా.

"మరేమీలేదు. వాడికి ముక్కుమీద రెండు మొటిమలు లేచాయిటా! అంచేత రాలేదు. ముసుగెట్టుకు పడుకున్నాడు"

సావిత్రి మంచంమీంచి ఒక్క ఎగురు ఎగిరి, ముక్కుకున్న కట్టుకాస్తా తెంపుకుని బయటికి వచ్చింది,

"ఆహా హా హా హా" అని ఒకటే నవ్వు సుందరంగారు "ఏమిటండీ" మా వాడికి మొటిమ లేచిందంటే అంత నవ్వుతారు?" అన్నాడు మోహన్ తండ్రి కాస్త కోపంగా.

"మరేంలేదు, మా అమ్మాయి కూడా అలాగే గోలచేస్తోంది లెండి. మొటిమ ఉందో యిప్పుడు పెళ్ళి చూపులొద్దో" అని అన్నారు సుందరంగారు నవ్వుతూ.